సోమలలో ఓ మోస్తరు వర్షం

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సోమలలో బుధవారం సాయంత్రం 8 గంటల ప్రాంతంలో భారీ ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. గత వారం రోజులుగా తీవ్రమైన ఎండ వేడిగాలులు ఉక్కపోతతో ఇబ్బందులు ఎదుర్కొన్న మండల ప్రజానీకం రాత్రి కురిసిన వర్షానికి కాస్త ఉపశమనం లభించింది. కాగా మండలంలో ఇప్పటికే పలుచోట్ల తాగునీటి సరఫరా చేసే బోర్లు వ్యవసాయ బోర్లు భూగర్భ జలాలు తగ్గడంతో అటు తాగునీటికి ఇటు వ్యవసాయానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో వర్షం కురవడం సంతోషాన్ని కలిగించినా చెరువులు నిండే విధంగా కురవాలని రైతులు ప్రజలు ఆశిస్తున్నారు.

సోమలలో కురుస్తున్న వర్షం

స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి

- మరో విద్యుత్ పోరాటానికి సిద్ధం కావాలి
- రౌండ్ టేబుల్ సమావేశంలో సిపిఎం- సిపిఐ నేతల పిలుపు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: విద్యుత్ ఛార్జీలు పెంచబోమని, తగ్గిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మరోసారి 2024-25 వినియోగంపై అక్రమంగా రూ.842కోట్లు సర్దుబాటు ఛార్జీలను మోపుతూ సదరన్, సెంట్రల్ పంపిణీ సంస్థలు చేసిన తాజా ప్రతిపాదనలను తక్షణమే విరమించుకోవాలని, స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని సిపిఎం, సిపిఐ నేతలు డిమాండ్ చేశారు. బుధవారం సిపిఎం జిల్లా కార్యాలయంలో సిపిఎం సిపిఐ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి అధ్యక్షత సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసుకున్న సిటీ ఒప్పందాన్ని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వ్యతిరేకించి అధికారంలోకి వచ్చిన తర్వాత అదే ఒప్పందాన్ని కొనసాగించి స్మార్ట్ మీటర్లు ప్రక్రియను వేగవంతం చేయడం దుర్మార్గమని దీనిని ప్రతి ఒక్కరు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. వామపక్షాల ఆధ్వర్యంలో దశవారీగా మరోసారి విద్యుత్ పోరాటానికి రాష్ట్రవ్యాప్తంగా పోరాటం ప్రారంభమైందని అందులో భాగంగా చిత్తూరు జిల్లాలో కూడా జరిగే పోరాటాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. స్మార్ట్ మీటర్లు పెడితే జరిగే నష్టాలపై ప్రజలకు విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు. 2024 ఏప్రిల్ నుండి యూనిట్‌కు 40పైసలు చొప్పున వినియోగదారుల నుండి అదనంగా వసూలు చేసిన ఇంధన సర్దుబాటు ఛార్జీలు రూ.2,787 కోట్లు వినియోగదారులకు తిరిగి చెల్లించాలని కోరుతున్నదని, తప్పుడు లెక్కలు ఇచ్చి అదనపు చార్జీలు వసూలు చేసిన కంపెనీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పెరిగిన కరెంటు బిల్లుతో నానా అవస్థలు పడుతున్న వినియోగదారులపై మరో రూ.842 కోట్లు సర్దుబాటు చార్జీల భారం మోపే ప్రతిపాదనలు చేయడం దుర్మార్గమన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ అదనపు వ్యయానికి కూటమి ప్రభుత్వమే బాధ్యత వహించాలని, ప్రజలకు జవాబు చెప్పాలని అన్నారు. తాజా సర్దుబాటు చార్జీల ప్రతిపాదనలను ఉపసంహరించుకుంటూ నియంత్రణ మండలికి ప్రభుత్వం లేఖ రాయాలని, ప్రజలపై భారం వేయొద్దని తెలిపారు. సిపిఎం నాయకులు బాలసుబ్రమణ్యం, జ్యోతి రావు, సిపిఐ నాయకులు గోపి, దాసర చంద్ర, మనీ, విజయ్ గౌరి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు

ప్రతి ఒక్కరికీ ఆధార్ తప్పనిసరి: కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: పకడ్బందీగా ఆధార్ నమోదు ప్రక్రియను చేపట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఆధార్ నమోదు ప్రక్రియపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి భారతీయ పౌరునికి ఆధార్ తప్పనిసరి అని, ఆధార్‌తో చాలా అంశాలు ముడిపడి ఉన్నాయని, సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపికకు ఆధార్ అనుసంధానంగా ఉందని, ఆధార్ నమోదులో పొరపాట్లకు తావులేకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. 2011 నుండి ఆధార్ నమోదు నిరంతర ప్రక్రియగా కొనసాగుతున్నదని అన్నారు. జిల్లాల ప్రత్యేకంగా కుప్పం, నగిరి నియోజకవర్గాలలో ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని తెలిపారు. వైద్య, విద్య, ఐసిడిఎస్, గ్రామ, వార్డు సచివాలయాల శాఖల సమన్వయంతో కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. రాష్ట్రస్థాయిలో మన జిల్లా 58 శాతం ఉన్నదని 0-5 సంవత్సరాల పిల్లలు, మూడు సంవత్సరాల నుండి ఆరు సంవత్సరాల వరకు అంగన్వాడీ కేంద్రాలలో ఉండే పిల్లలు నమోదు అయినారా లేరా పరిశీలించాలని ఐసిడిసి అధికారులను ఆదేశించారు. సెప్టెంబర్ నెల నాటికి జిల్లాలో ఆధార్ నమోదు వంద శాతం ఉండాలి, బర్త్ సర్టిఫికెట్ జారీ చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. త్వరలో సంబంధిత ఆర్డీవోలు, ఎమ్మార్వోలు, మున్సిపాలిటీ కమిషనర్లతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో మొత్తం 226 ఆధార్ నమోదు కేంద్రాలు ఉన్నాయని, అందులో 117 గ్రామ/వార్డు సచివాలయాలు, 7 ఈ-సేవా సెంటర్లు, 9 పోస్ట్ ఆఫీసులు, 9 బిఎస్ఎన్ఎల్ ఆఫీసులు, 14 బ్యాంకులు, 34 వైద్య కుటుంబ సంక్షేమ శాఖ కార్యాలయ ద్వారా ఆధార్ నమోదు, బయోమెట్రిక్ అప్ డేషన్ ప్రక్రియ చేపట్టడం జరుగుతుందన్నారు. బయోమెట్రిక్ అప్ డేషన్ నిరంతర ప్రక్రియగా ఉందని 0నుంచి 5, 3 నుంచి 7 సంవత్సరాల మధ్య వయసులో ఒకసారి, 15 నుంచి 17 సంవత్సరాల వయసు మధ్యలో మరోసారి ఆధార్ అప్‌డేషన్ తప్పనిసరి అన్నారు. ప్రతినెలా అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీల్లో తప్పనిసరిగా పిల్లల నమోదు శిబిరాలు నిర్వహించాలన్నారు. డిఎల్‌డిఓ రవికుమార్, ఐసిడిఎస్ పీడీ వెంకటేశ్వరి, డీఎంహెచ్వో, డీఈవో పాల్గొన్నారు.

ఆధార్ నమోదు ప్రక్రియపై అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

తప్పులు లేని ఓటర్ల జాబితా రూపొందించాలి

జిల్లా రెవెన్యూ అధికారి మోహన్ కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్ఓ మోహన్ కుమార్

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్: తప్పులు లేని ఓటర్ల జాబితా రూపొందించాలని, ఇందుకోసం బూత్ లెవెల్ ఆఫీసర్లు (బీఎల్వోలు) ఓటర్ల జాబితా రూపకల్పన, మార్పులు చేర్పులపై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని జిల్లా రెవెన్యూ అధికారి మోహన్ కుమార్ చెప్పారు. బుధవారం చిత్తూరు నగరపాలక కార్యాలయంలో జరుగుతున్న చిత్తూరు నియోజకవర్గ బీఎల్వోల శిక్షణ కార్యక్రమానికి విచ్చేశారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా రూపకల్పనలో బిఎల్వోల పాత్ర కీలకమని, ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను అనుసరించి తప్పులు లేని ఓటర్ల జాబితా రూపొందించాలన్నారు. ఓటర్ల జాబితా ఇంటింటి పరిశీలనను పకడ్బందీగా పూర్తి చేయాలన్నారు. ఒక కుటుంబంలోని వారంతా ఒకే చోట ఉండేలా చూడాలన్నారు. సర్వే సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఓటర్ల జాబితాలో చిరునామా, ఇతర వివరాల మార్పులు చేర్పులకు సంబంధించి నిబంధనాలను కచ్చితంగా పాటించాలని, క్షేత్రస్థాయి పరిశీలన, తగిన ధృవీకరణ పత్రాలను జత చేయాలన్నారు. సర్వేలో పారదర్శకంగా వ్యవహరించాలని, పొరబాట్లు చేస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయన్నారు. ఏఎస్వో సౌందర్ రాజన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఈఆర్వో అండ్ ఆర్డీవో శ్రీనివాసులు, కమిషనర్ పి.నరసింహ ప్రసాద్, సహాయ కమిషనర్ ఎ.ప్రసాద్, రూరల్, అర్బన్ తహశీల్దార్లు కులశేఖర్, జయప్రకాష్, ఎలక్షన్ డీటీ హిమగిరి, బీఎల్వోలు పాల్గొన్నారు.

రైతుల వివరాలను పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి- తవణంపల్లి: జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ బుధవారం మండలంలో ప్రస్తుత సీజన్లో మామిడి కాయల విక్రయాల డేటాను పరిశీలించారు. మండలంలోని మొగం గాజులపల్లి, మల్లకుంట సచివాలయ పరిధిలో మామిడి రైతులు ఫ్యాక్టరీలకు రాంపుల ద్వారా జరిపిన విక్రయాలకు సంబంధించి డేటాను పరిశీలించారు. ఇందులో భాగంగా రైతుల పేర్లు, ఆధార్ కార్డు, నెంబర్లు, బ్యాంక్ నెంబర్లు, ఐఎఫ్ఎస్సి కోడ్‌లు సక్రమంగా ఉన్నాయా లేదా అని పరిశీలించారు. అలాగే ఒక రైతుకు సంబంధించి ఎంత విస్తీర్ణంలో పొలం ఉన్నది ఎంత విస్తీర్ణంలో మామిడి సాగు చేస్తున్నారు ఎంత మొత్తంలో ఫ్రాక్టీలకు కాయలను సరఫరా చేశారనే వివరాలు పరిశీలించారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్ రెడ్డి, తహశీల్దార్ సుధాకర్, మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్, ఉద్యాన శాఖ అధికారి హారిక సాగరిక, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విజయంలో ఇన్వెస్టిట్యూర్ వేడుకలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: స్థానిక సుందరరాజపురం విజయం సీబీఎస్ఈ పాఠశాలలో విద్యాసంస్థల అధినేత డాక్టర్ తేజోమూర్తి అధ్యక్షతన బుధవారం ఇన్వెస్టిట్యూర్ వేడుకలు నిర్వహించారు. ఓటింగ్ ద్వారా ఎంపికైన పాఠశాల క్యాబినెట్‌లోని సభ్యులు హెడ్ బాయ్, హెడ్ గర్ల్ స్పోర్ట్స్ కెప్టెన్‌లకు బ్యాడ్జీలు ప్రదానం చేసి ప్రమాణ స్వీకారం చేయించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు అఖిల రమేష్ మాట్లాడుతూ ఎన్నికల్లో గెలిచిన విజేతలకు పాఠశాల నియమ నిబంధనలు క్షుణ్ణంగా వివరించారు. పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ శైలజ మూర్తి మాట్లాడుతూ విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు ఉండాలన్నారు.

ఉపాధ్యాయులకు ఘన సత్కారం

ప్రజాశక్తి- యాదమరి: యాదమరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు హేమలత అధ్యక్షతన శ్రీలలిత కళావేదికలో నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో బదిలీపై వెళ్లిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ప్రధానోపాధ్యాయులు ఎం.గిరిరాజా, కోఆర్డినేటర్ ఎస్ఎస్ఏజే మధు, వ్యాయామ ఉపాధ్యాయులు రవి, హరికృష్ణ, సోషల్ అధ్యాపకులు ఉదయ్ బాబు, ఫిజిక్స్ అధ్యాపకులు ఆర్.నిర్మల, ఆంగ్ల అధ్యాపకులు వెంకటేశ్వర్లు, గీత, కిరణ్మయి సహనాజ్, లీలా కుమారి, శిల్ప బదిలీపై వెళ్లారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులను దుస్సాలువ, పూలమాల వేసి రజత జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమం ఫస్ట్ అసిస్టెంట్ వెంకటరమణ, ఉపాధ్యాయులు లక్ష్మీ ప్రసాద్, కృష్ణమూర్తి, విజయ్ కుమార్, కె.దామోదరాచారి పాల్గొన్నారు.

పిహెచ్‌సిల్లో గర్భిణుల నమోదు పక్కాగా జరగాలి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: మాతా శిశు సంరక్షణలో భాగంగా మెడికల్ ఆఫీసర్లు వారి పరిధిలో గల ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు బాధ్యతాయుతంగా పనిచేసేలా మెడికల్ ఆఫీసర్లు నిరంతర పర్యవేక్షణ ఉండాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. బుధవారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డిటి సుధారాణి ఆధ్వర్యంలో జిల్లాలోని వైద్యాధికారులతో మూడు మాతృ మరణాలపై కొలమాసనపల్లె, ఓగు, విజలాపురం పిహెచ్‌సిలో జరిగిన మరణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్‌సిహెచ్ కార్యక్రమంలో గర్భిణీ స్త్రీల నమోదు, వారికి ఇవ్వవలసిన సేవలు ఖచ్చితత్వంతో పూర్తిస్థాయిలో అందించిన ఎడల పూర్తి స్థాయిలో మాతాశిశు మరణాలు నివారించవచ్చు అన్నారు. గర్భిణీ స్త్రీల నమోదులో ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా అంగన్వాడీ రిజిస్టర్‌లో సరి చూసుకోవాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భవతులకు సరైన సమయంలో పోషకాహారం అందించడం ద్వారా రక్తహీనత సమస్యలను నివారించవచ్చునన్నారు. ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, గర్భిణీలలో రక్తహీనత సమస్య తలెత్తకుండా గర్భధారణ దాల్చిన సమయం నుండి డెలివరీ అయ్యేంత వరకు ఆ మహిళల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. దీనితోపాటు హై రిస్క్ గర్భవతుల పట్ల ఎప్పటికప్పుడు వారి ఆరోగ్య స్థితిగతులు తెలుసుకొని అవసరమైన వైద్యసేవలు అందించాలన్నారు. హైరిస్క్ గర్భిణీ స్త్రీలకు రక్తహీనత లేకుండా ఎప్పటికప్పుడు బిపి, షుగర్, హై బిపి చెక్ చేస్తూ, అవసరమైతే సుక్రోస్ ఇంజక్షన్‌ను వేయించి రక్తహీనత లేకుండా పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తు సేవలు అందిస్తే రక్తహీనత లేకుండా చూడొచ్చని అంగన్వాడీల్లో నందు ఇచ్చే పౌష్టికాహారాన్ని తనిఖీ చేయాలన్నారు. భవిష్యత్తులో మాతృ మరణాలు జరగకుండా జిల్లా స్థాయిలో, ప్రాథమిక స్థాయిలో ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. పుట్టిన ప్రతి బిడ్డను రిజిస్ట్రేషన్ చేయడం ద్వారా వారికి నిర్దేశించిన సమయంలో వాక్సినేషన్ వేసి పిల్లల ఆరోగ్య స్థితిగతులను ఎప్పటికప్పుడు చూసేందుకు అవకాశం ఉంటుందని ఈ విషయంలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, బాధ్యతాయుతంగా పనిచేయడంలో మెడికల్ ఆఫీసర్లు కీలకపాత్ర పోషించాలన్నారు. గర్భిణీ స్త్రీల నమోదు, చిల్డ్రన్ రిజిస్ట్రేషన్‌లో సంబంధించి ప్రతి పిహెచ్‌సి పరిధిలో మెడికల్ ఆఫీసర్లు ఏఎన్ఎంలు ఆశా వర్కర్లతో తరచూ సమావేశాలు నిర్వహించి పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంతో ఉప వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటప్రసాద్, డిఐఓ డాక్టర్ హనుమంతరావు, ప్రోగ్రాం అధికారులు, వైద్య అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ఉపాధి హామీ ఉద్యోగుల నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి): రాష్ట్ర మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ ఉద్యోగుల సంఘం చిత్తూరు జిల్లా శాఖ గౌరవాధ్యక్షుడుగా డాక్టర్ బి.సుబ్రహ్మణ్యం, చైర్మన్‌గా కె. గుణశేఖర్ (పెనుమూరు ఏపీవో), ప్రధాన కార్యదర్శిగా ఎస్.శ్రీనివాసులు (గుడిపాల ఏపీవో), కోశాధికారిగా ఆర్.కిరణ్ (సీవో) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం చిత్తూరులోని గంగినాయుని చెరువు పార్క్‌లో ఏపీడీ బి.సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉపాధి హామీ ఉద్యోగుల జేఏసీను నూతనంగా ఏర్పాటు చేసుకున్నారు. వైస్ చైర్మన్‌గా కె.గణేష్ (ఈసీ), ఇ.మధుసూదన్ నాయుడు (జేఈ), కె.మహేంద్ర (టిఏ), డి. ధనంజయ (సీవో), ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా వి.సంధ్యా రాణి (ఏపీవో), ఎస్.విశ్వనాధన్ (టిఏ)లు ఎన్నికయ్యారు. ఆలాగే సంయుక్త కార్యదర్శులుగా కె.వెంకటరమణారెడ్డి (టిఏ), కె. పరమశివ (జెఈ), డి.ఎం. కిరణ్ (సీవో), సి. రామమూర్తి (టి.ఏ)లు ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా ఆర్ఎల్.రాకేష్ (టీఏ) పి.మనోహర్ (టి.ఏ), ఎం.పరదేసి (టి.ఏ), ఏ.మురళీ కృష్ణ (సీవో), వి.మహేశ్వరీ (సీవో), డ్వామా నుంచి వికె. చంద్రమోహన్, వాటర్ షెడ్ నుంచి ఎస్.వెంకటముని, ఎంటీసీ, ప్లాంటేషన్ సూపర్‌వైజర్ల నుంచి కవిత, డ్రైవర్స్, అటెండర్స్ నుంచి రాఘవలను ఎన్నుకున్నారు. ఉపాధి హామీ నూతనంగా ఎన్నికైన అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ ఉపాధి హామీ ఉద్యోగులందరికీ గ్రాట్యుటీ కల్పించాలని, అలవెన్సులన్నీ బేసిక్‌లో కలిపి, గత పిఆర్‌సి ప్రకారం 23శాతం జీతాలు పెంచాలని, అన్ని క్యాడర్ల ఉద్యోగులకు ఉద్యోగోన్నతులు కల్పించి ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, క్యాష్ లెస్ హెల్త్ కార్డులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

జిల్లా గౌరవాధ్యక్షులు డాక్టర్ బి.సుబ్రహ్మణ్యం

జేఏసీ చైర్మన్ కె. గుణశేఖర్

జేఏసీ ప్రధాన కార్యదర్శి ఎస్.శ్రీనివాసులు

జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి సంధ్యారాణి

జర్నలిస్టు హెల్త్ స్కీమ్ పొడిగింపు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: వర్కింగ్ జర్నలిస్టు హెల్త్ స్కీమ్ 2025- 26 ఆర్థిక సంవత్సరానికి పొడిగిస్తూ వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంగళవారం జీవో ఎం.ఎస్ నెం. 77ను జారీ చేసినట్లు సమాచార పౌర సంబంధాల శాఖ, సంచాలకులు హిమాన్షు శుక్ల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున రాష్ట్ర వ్యాప్తంగా అక్రిడిటేషన్లు అమలులో ఉన్న వర్కింగ్ జర్నలిస్టులందరూ ఈ పథకం ప్రీమియం క్రింద రూ.1250లు డబ్ల్యు డబ్ల్యు డబ్ల్యు. సిఎఫ్ఎంఎస్.ఏపి.జిఓవి.ఇన్ వెబ్ సైట్ ద్వారా ప్రీమియం చెల్లించిన జర్నలిస్టులు ఒరిజినల్ చలానా, రెన్యూవల్ చేయించుకున్న రాష్ట్రస్థాయి అక్రిడిటేషన్ జిరాక్స్ కాపీలను విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండ్, ఎన్టీఆర్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్‌లోని రెండవ ఫ్లోర్‌లో ఉన్న సమాచార పౌర సంబంధాల శాఖ, సంచాలకుల కార్యాలయంలోనూ, జిల్లా స్థాయి జర్నలిస్టులు సంబంధిత జిల్లా కేంద్రాల్లోని సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో అందజేయాల్సిందిగా సంచాలకులు తెలిపారు. వర్కింగ్ జర్నలిస్టు హెల్త్ స్కీం ప్రీమియం రూ. 2,500కాగా ఇందులో జర్నలిస్టు వాటా రూ.1,250, ప్రభుత్వం వాటా రూ.1,250లు చెల్లిస్తున్నట్లు తెలిపారు. జర్నలిస్టు, భార్య/భర్త, పిల్లలు, జర్నలిస్టుపై ఆధారపడిన తల్లిదండ్రులకు ఈ స్కీమ్ వర్తిస్తుందన్నారు. ఈ స్కీమ్‌లో భాగంగా ప్రభుత్వం కార్పస్ ఫండ్‌ను నిర్వహిస్తూ జర్నలిస్టుల వైద్య ఖర్చులను డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు విధి విధానాలను అనుసరించి చెల్లిస్తుందన్నారు. జర్నలిస్టు హెల్త్ స్కీమ్ ద్వారా జర్నలిస్టులు, వారిపై ఆధారపడ్డ కుటుంబ సభ్యులకు ఏదైనా అనారోగ్యం సంభవించిన ప్రతిసారి రూ.2లక్షల వరకు విలువ చేసే వైద్య సేవలు అందుతాయని, ఇలా సంవత్సర కాలంలో ఎన్నిసార్లైనా పరిమితులు లేకుండా ఈ సదుపాయాన్ని అందిస్తారని తెలిపారు. వర్కింగ్ జర్నలిస్టు హెల్త్ స్కీమ్ ద్వారా జర్నలిస్టులకు ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ తరహాలో నగదు రహితంగా వైద్యసేవలను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు. వర్కింగ్ జర్నలిస్టు హెల్త్ స్కీమ్ ద్వారా పొందే వైద్య సేవల విషయంలో ఎలాంటి ఆదాయ పరిమితులు లేవని, అదేవిధంగా నిర్దేశిత చికిత్సలకు సంబంధించి ఉచిత అవుట్ పేషెంట్ సేవలు కూడా పొందవచ్చని ఆయన వివరించారు. ఈ పథకానికి డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీగా, అదే విధంగా సమాచార పౌర సంబంధాల శాఖ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుందని ఆయన పేర్కొన్నారు. అక్రిడిటేషన్ కలిగి ఉన్న జర్నలిస్టులందరూ ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలోని నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడానికి జిల్లా యంత్రాంగం కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సమిత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా సచివాలయం కలెక్టర్ చాంబర్ సమావేశపు మందిరంలో ఉల్లాస్ పథకం అమలు, "అక్షర ఆంధ్ర" ప్రారంభం అంశాలపై ట్రైనీ కలెక్టర్ నరేంద్ర పడేల్‌తో కలిసి జిల్లాలో స్వచ్ఛంద ఉపాధ్యాయుల నియామకం, తరగతుల నిర్వహణ నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉల్లాస్ అనే పథకాన్ని 2024 అక్టోబర్ నుండి రాష్ట్రంలోని అన్ని 26 జిల్లాల్లో అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. 2024- 25 సంవత్సరంలో ఈ కార్యక్రమం జిల్లాలో విజయవంతంగా నిర్వహించాలని తెలిపారు. జిల్లాలో సుమారు 40వేల మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడానికి అన్ని శాఖలు కలిసి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమం 2029 నాటికి ఆంధ్రప్రదేశ్‌లో 100శాతం వయోజన ప్రాథమిక అక్షరాస్యత సాధించాలనే లక్ష్యంతో 'అక్షర ఆంధ్ర' అనే ప్రత్యేక అక్షరాస్యత కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టడం జరిగిందని తెలిపారు.

శభాష్..మానస..!

ఇటు మరణం.. అటు పరీక్ష..!
ఎంఎస్‌సి పరీక్షకు హాజరు
తండ్రికి కొరివి పెట్టిన కుమార్తె



మహిళా యూనివర్సిటీలో ఉదయం పరీక్ష రాస్తూ... తండ్రికి తలకొరివి పెడుతున్న కుమార్తె మానస

ప్రజాశక్తి - రేణిగుంట

ఓ వైపు తండ్రి మరణం.. మరోవైపు ఎంఎస్సీ పరీక్ష.. విషాదాన్ని దిగమింగుకుని ఆ కుమార్తె ఎంఎస్‌సి పరీక్షకు హాజరయ్యింది. తరువాత ఇంటికి వచ్చి పుట్టెడు శోకంతోనే తండ్రికి తలకొరివి పెట్టి అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది.. 'ఎవరన్నారు ఆడపిల్లలు తక్కువ' అని నిరూపించిన మానసప్రియ ధీరత్వాన్ని చూసి 'శభాష్' అని చుట్టుపక్కల వారు మెచ్చుకున్నారు.. వివరాలిలా ఉన్నాయి.

తిరుపతి జిల్లా రేణిగుంట మండలం దిగువ మల్లవరం అరుంధతివార్డులో విషాదం చోటు చేసుకుంది. కె.మస్తాన్‌కు ముగ్గురు కుమార్తెలు. పెద్ద కుమార్తె సుస్మితప్రియ హైదరాబాద్‌లో ఫిజియోథెరపిస్ట్ డాక్టర్‌గా పనిచేస్తుండగా హార్ట్‌ఎటాక్‌తో ఈ ఏడాది ఏప్రిల్ 8న మృతిచెందింది. కుమార్తె మరణంతో మానసికంగా కుంగిపోయిన తండ్రి మస్తాన్‌కు మూడు నెలల కాలంలోనే పక్షవాతం వచ్చి 15వ తేదీ మంగళవారం మృతిచెందాడు. ఓ వైపు పెద్ద కుమార్తె, మరోవైపు పెద్ద దిక్కుగా ఉన్న తండ్రి మృతితో ఆ కుటుంబానికి కోలుకోలేని దెబ్బ. రెండో కుమార్తె మానసప్రియ ఎంఎస్‌సి జువాలజీ చదువుతోంది. తండ్రి మరణవార్త విషాదాన్ని దిగమింగుకుని 16వ తేదీ బుధవారం తిరుపతి మహిళా యూనివర్సిటీలో ఎంఎస్‌సి జువాలజీ ప్రాక్టికల్ పరీక్ష రాసి ఇంటికి వచ్చింది. విషాదవదనంతోనే తండ్రికి తలకొరివి పెట్టింది. 'పుత్రుడు పున్నామ నరకం నుంచి తప్పిస్తాడని, ఆడపిల్లలు భారమని పురిట్లోనే చంపేసిన ఘటనలూ చూశాం..' వీరందరికీ మానసప్రియ చెంపపెట్టుగా నిలిచింది. బాధను దిగమింగుకుని పరీక్ష రాసింది.. తండ్రికి తలకొరివి పెట్టి ఆ కుటుంబం గర్వపడేలా చేసింది.

ఏడాది లోపు 80 శాతం హామీలు పూర్తి

పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్

యాదమరి మండలంలో

ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం పూతలపట్టు నియోజకవర్గంలో బుధవారం జోరుగా సాగుతుంది. యాదమరి మండలం, 155-కమ్మపల్లె, పత్రపల్లె, సిద్దారెడ్డిపల్లె పంచాయతీలో ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ ఇంటింటికి వెళ్లి ఏడాది పాలనలో ఇచ్చిన హామీలను 80 శాతం పూర్తి చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కిందని, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోవడానికి ఇంటింటికీ కార్యక్రమం చేపట్టడం జరిగిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు వివరిస్తూ కరపత్రాలను పంచిపెట్టారు. ఈసందర్భంగా గ్రామస్తులు తెలిపిన కొన్ని సమస్యలు అక్కడెక్కడికే పరిష్కరిస్తూ.. మరికొన్ని సమస్యలు తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. మండల అధ్యక్షులు మూర్తి యాదవ్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్ రబ్బీ, చిత్రా నాయుడు, అమరనాథ్ నాయుడు, సుభాష్ నాయుడు, విజయేంద్ర యాదవ్, గోపి గౌడ్, మాధవ నాయుడు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారు

ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్

చిత్తూరు అర్బన్: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వ పాలనపై రాష్ట్ర ప్రజలు సంతృప్తికరంగా, సంతోషంగా ఉన్నారని, క్షేత్రస్థాయి పర్యటనలో ప్రజల నుంచి అపూర్వ స్పందన వస్తోందని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు. సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటికి మీ ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా బుధవారం చిత్తూరు నియోజకవర్గ గుడిపాల మండలంలోని పానాటూరు, గొల్లమడుగు, బొమ్మసముద్రం, మరకాలకుప్పం గ్రామపంచాయతీ పరిధిలో విస్తృతంగా పర్యటించారు. ప్రతి ఇంటి వద్ద వృద్ధులు, మహిళలు, రైతులను ఆప్యాయంగా పలకరించి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఆరా తీశారు. అనంతరం అనుపు గ్రామానికి నూతనంగా వేసిన బీటీ రోడ్డును ప్రారంభించారు. నాయకులు సుబ్బానాయుడు, సొసైటీ చైర్మన్ ప్రతాప్ నాయుడు, అనిల్, బాలాజీ నాయుడు, నాగరాజు యాదవ్, సుమతి, హరి పాల్గొన్నారు.

గుడిపాల మండలంలో

టిడిపితోనే అభివృద్ధి సంక్షేమం

ప్రభుత్వ ఎమ్మెల్యే డాక్టర్ థామస్

కార్వేటినగరం: మండల పరిధిలోని ఆలత్తూరు పంచాయతీ టిటి కండ్రిగ గ్రామంలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ థామస్ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమం గురించి ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంచిపెట్టారు. జనసేన ఇంచార్జ్ పొన్న యుగంధర్, మండల అధ్యక్షులు చెంగల్రాయల్ యాదవ్, కార్యదర్శి రాజేంద్రరెడ్డి, జిల్లా తెలుగు యువత అధ్యక్షులు నాగేశ్వర రాజు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

కార్వేటినగరం మండలంలో

రైల్వేయార్డుల్లో భద్రత ఏది..?

నిర్లక్ష్యంగానే రైల్వేశాఖ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి యాత్రా స్థలంలో రోజుకు 60-70వేల మంది యాత్రికులు రైళ్లలో ప్రయాణిస్తూ ఉంటారు. రోజుకు రైల్వేస్టేషన్‌కు 70 రైళ్లు రాకపోకలు సాగిస్తూ ఉంటాయి. తిరుపతి రైల్వేస్టేషన్‌లో కేవలం ఆరు ప్లాట్‌ఫారాలే ఉన్నాయి. ప్లాట్‌ఫారాల సంఖ్య తక్కువగా ఉండడంతో చింతలచేను వద్ద ఉన్న రైల్వేయార్డులో పలు రైళ్లను నిలిపేస్తారు. కరీంనగర్ నుంచి తిరుపతికి వచ్చే రాయలసీమ ఎక్స్‌ప్రెస్ ఉదయం ఏడు గంటలకు తిరుపతికి చేరుకుంటుంది. ఈ రైలు తిరిగి తిరుపతి నుంచి సాయంత్రం ఐదు గంటలకు బయల్దేరుతుంది. అప్పటివరకూ ఈ రైలు చింతలచేను దగ్గర ఉన్న రైల్వేయార్డులో నిలిపి ఉంచుతారు. ఈ రైల్వే యార్డు వద్ద చాలా మంది ఆకతాయిలు తిరుగుతూ ఉంటారు. అక్కడే బీడీలు, సిగిరెట్లు తాగుతుంటారు. కొంతమంది గంజాయి బ్యాచ్‌కు ఇదే ఆవాసం. రైల్వే యార్డుల వద్ద ఎటువంటి సెక్యూరిటీ లేకపోవడం గంజాయి బ్యాచ్ చెలరేగిపోవడానికి అవకాశం లేకపోలేదు. యార్డుల్లో ఉండే రైళ్లను బయల్దేరడానికి గంట ముందే ఔటర్ నుంచి తీసుకొచ్చి ప్లాట్‌ఫాంపై ఉంచుతారు. యార్డులోనే దాదాపు ఆరేడు గంటలు నిలిపి ఉంచుతారు. తిరుపతి హిసార్ రైలు భోగి దగ్ధం సందర్భంగా సకాలంలో ఫైరింజన్ రాకపోవడం కూడా మంటలు వ్యాపించడానికి ఆస్కారం ఏర్పడింది. రైల్వే శాఖ వద్ద సీస్ ఫైర్ పనిముట్లు కూడా చాలా తక్కువే ఉన్నట్లు తెలుస్తోంది. హి సార్ రైలు బోగి దగ్ధం కావడం పట్ల రైల్వేబోర్డు ఉన్నతాధికారులు ఇప్పటికే విచారణ చేపట్టారు. ఈ భోగి ఎవరైనా కావాలనే కాల్చేశారా? ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్ జరిగిందా? లేదంటే రైలు బోగీలో బ్యాటరీలో ఏదైనా లోపం ఏర్పడిందా? అనే దిశగా విచారణ జరుపుతున్నారు. పక్కనే ఉన్న రాయలసీమ ఎక్స్‌ప్రెస్ రైలు బోగీ కూడా కాలడంతో రైల్వేశాఖకు పెద్దఎత్తున నష్టం వాటిల్లింది. రైల్వే ప్లాట్‌ఫారాల్లో మాత్రమే సిసి కెమెరాలు ఉంటాయి తప్ప, యార్డుల్లో లేకపోవడం భద్రతా వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. పడమర, తిరుచానూరు రైల్వేస్టేషన్ల వద్ద కొంతవరకూ భద్రత ఉంటుంది. అయితే చింతలచేను వద్ద ఉన్న రైల్వేయార్డు వద్ద భద్రత అంతగా లేదనే చెప్పాలి. ఇకనైనా రైల్వే ఉన్నతాధికారులు రైల్వే ఆస్తుల భద్రత విషయంలో పక్కా ప్రణాళికతో సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం, సెక్యూరిటీ సిబ్బందిని పెంచే చర్యలు తీసుకోవాల్సి ఉంది.

చిన్న సూపర్ మార్కెట్‌ల్లోనూ, అపార్టుమెంట్‌ల్లోనూ, హోటళ్లలోనూ ఎక్కడ చూసినా సిసి కెమెరాలే.. ఎందుకంటే తమ ఆస్తులకు భద్రత అవసరమని ఆయా యజమానులు భావించారు కాబట్టి.. అయితే తిరుపతి వంటి ప్రముఖ యాత్రా స్థలంలో రైల్వే యార్డులో భద్రత లేదనే చెప్పాలి.. తాజాగా హిసార్ రైలు బోగీ తిరుపతి రైల్వేయార్డులో దగ్ధమయ్యింది. అయితే కారణం ఏంటన్నది ఇప్పటికీ తెలియరాలేదు. అధికారులు ఇప్పటికీ విచారిస్తూనే ఉన్నారు. యాత్రాస్థలమైన తిరుపతిలో గంజాయి బ్యాచ్ కోరలు చాచి ఉంది.. ఎవరైనా గంజాయి మత్తులో సిగిరెట్ తాగి పడేశారా? లేక ఇంకేమైనా కారణమా అన్నది విచారణలో తేలాల్సి ఉంది. 2012-13 సంవత్సరంలోనూ రైల్వే యార్డులో ఇదేవిధంగా ఓ భోగి పూర్తిగా దగ్ధమైంది.

బంగారు కుటుంబాలకు భరోసా ఇవ్వాలి : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: పేదరికం నిర్మూలన దిశగా 'పి4' కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతోందని కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్‌లో జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, మున్సిపల్ కమిషనర్ మౌర్య, ట్రైన్ కలెక్టర్ సందీప్ రఘు వాన్షీ, మార్గదర్శకులతో కలిసి పి 4 పై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో బంగారు కుటుంబాలను గుర్తించామని, టాప్ 10మార్గదర్శకులు, బాటమ్ 20 శాతం బంగారు కుటుంబాల అవసరాల మేరకు విద్య, నైపుణ్యం, వారికి కావాల్సిన అవసరాలను అందించాలన్నారు. ఈనెల 19వ తేదీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తిరుపతి జిల్లాకు రానున్నారని, ప్రజావేదిక కార్యక్రమంలో భాగంగా బంగారు కుటుంబాలు, మార్గదర్శకులతో ముఖ్యమంత్రి ఇంటరాక్షన్ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, తాజ్ హోటల్ , రాస్, అమరరాజా, రోటరీ క్లబ్, పాయ్ వైస్రాయ్ హోటల్ సంబంధించిన ప్రతినిధులు మార్గదర్శకులు పాల్గొన్నారు.

19న చంద్రబాబు తిరుపతికి రాక



'అయ్యో'ర్ల కొరత..!

ఉద్యోగ విరమణలతో మరిన్ని ఖాళీలు

సబ్జెక్టులకు అనుగుణంగా ఉపాధ్యాయులేరి?

'విలీనం' పేరుతోనూ విద్యకు దూరం

విద్యాశాఖ ముందస్తు చర్యలు శూన్యం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

'నేటి బాలలే రేపటి పౌరులు' అని వివిధ కార్యక్రమాలలో, సభలలో ఊదరగొట్టే ప్రభుత్వ పెద్దలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా సంవత్సరం ప్రారంభమై నెలరోజులు దాటినా విద్యార్థుల సబ్జెక్టులకు సంబంధించిన, అనివార్యమైన ఉపాధ్యాయులను నియమించడంలో మీనమేషాలు లెక్కిస్తూనే ఉన్నారు. ప్రభుత్వం వద్ద ప్రస్తుతం విధుల్లో ఉన్న ఉపాధ్యాయులు వారి విధుల కాలం, పదవీ విరమణ తేదీలు పక్కాగా సమాచారం ఉన్నా, సకాలంలో డిఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయుల నియామకం చేపట్టి విద్యార్థులకు ఉపాధ్యాయుల కొరత లేకుండా, విద్యాబోధన జరిగేలా చూడాల్సిన బాధ్యత కలిగిన ప్రభుత్వం ఈ దిశగా ఆలోచించడం లేదు. పాలకుల నిర్లక్ష్యం కారణంగా విద్యా సంవత్సరం ప్రారంభమై నేటికి నెల రోజులు గడుస్తున్నా కొన్ని సబ్జెక్టులకు సంబంధించి ఉపాధ్యాయులు లేకపోవడం కారణంగా విద్యార్థులు విద్యాసంవత్సరంలో కొన్ని రోజులపాటు ఆయా సబ్జెక్టులపై పూర్తిస్థాయి అవగాహన కోల్పోతున్నారన్నది వాస్తవం. మంగళం పరిధి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మంగళం ట్రెండ్స్ లో విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా హై స్కూలుకు సంబంధించి సాంఘిక శాస్త్రం, బయాలజీ సబ్జెక్టులకు ఇప్పటివరకు టీచర్ల నియామకం జరగలేదు. అదేవిధంగా హై స్కూల్ ప్లస్ కు సంబంధించి ఫిజిక్స్, ఆంగ్లము సబ్జెక్టుకు ఉపాధ్యాయులు లేరు. దీంతో ఈ సబ్జెక్టులకు సంబంధించి పాఠశాల పని దినాలలో హాజరైన విద్యార్థులకు ఈ సబ్జెక్టులపై బోధన చేసేవారు లేకపోవడంతో నెలరోజుల విలువైన కాలాన్ని వారు కోల్పోయినట్లే..

ఆలస్యంగా నియామకం జరిగితే.....

విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు గడిచింది. కొన్ని సబ్జెక్టులకు సంబంధించి ఉండాల్సిన సంఖ్యకన్నా తక్కువ ఉపాధ్యాయులు ఉండడం, ఆలస్యంగా నియామకం జరిగితే వచ్చే ఆ ఉపాధ్యాయులు ఆ సబ్జెక్టులను బోధించడంతో విద్యార్థులపై మానసిక భారం మోపిన వారయ్యే అవకాశం ఉంది. కొంతమంది విద్యార్థులు మంగళం ట్రెండ్స్ పాఠశాలలో గణితానికి కూడా ఇప్పటివరకు ఏ ఉపాధ్యాయులు వచ్చి బోధన చేయలేదని 'ప్రజాశక్తి'కి సమాచారం అందడంతో దీనిపై ప్రధానోపాధ్యాయులు కేశవులు నాయుడును వివరణ కోరగా ఇకనుండి గణితం బోధించడానికి ఉపాధ్యాయురాలిని పంపుతున్నామని చెప్పారు. ప్రస్తుతం మంగళం ట్రెండ్స్ లో 881 మంది విద్యార్థులు(హై స్కూల్, హై స్కూల్ ప్లస్ కలిపి)ఉన్నారు. రెండింటికి కలిపి 35 మంది బోధన సిబ్బంది ఉండాల్సి ఉండగా 30 మంది మాత్రమే ఉన్నారు.

క్రైం న్యూస్

గ్రామాల్లో భూ తగాదాలు

తహశీల్దార్ సమక్షంలో గొడవ పడుతున్న రైతులు

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలో రెవెన్యూ సమస్యలతో నిత్యం గొడవలు, ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి, దీంతో పోలీసుస్టేషన్‌లో కేసులు, తహశీల్దార్‌కు ఫిర్యాదులు చేస్తున్న పరిస్థితి. మండలంలోని తీర్థం గ్రామానికి చెందిన నారాయణప్ప అనే రైతుకు ఒక ఎకరా17సెంట్లు భూమి కుటుంబ వారసత్వంగా వస్తోంది. అయితే ఈ భూమని అదే గ్రామానికి చెందిన గోవిందస్వామి అనే వ్యక్తి ఆన్‌లైన్‌లో పాస్ బుక్ చేయించుకున్నాడు. దీంతో బాధిత రైతు ఎమ్మార్వోకి ఫిర్యాదు చేయగా గోవిందస్వామి ఆ భూమి తమదే అని అందుకు సంబంధించి పాస్ పుస్తకాలు, టైటిల్ ఐడిలు తన వద్ద వున్నాయి ఆ భూమి తనదే అని చెప్పడంతో వారి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. దీంతో సోమవారం తహశీల్దార్ ఎంఎస్. ప్రసన్న కుమార్ చొరవ తీసుకుని భూ సమస్యను పరిష్కరిస్తామని, భూమికి సంబంధించి ఎవరి వద్ద ఏయే ఆధారాలు ఉన్నాయో ఇరువురు రైతులు పొందుపరచాలని తెలిపారు. అయితే బుధవారం ఇరువర్గాల వారు మళ్లీ గొడవ పడటంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. మండలంలోని గ్రామ పంచాయతీల్లో చాలా మంది రైతులు భూ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని రెవెన్యూ అధికారులు స్పందించి న్యాయంగా భూమి ఎవరి చెందుతుందో వారికే చెందేలా చర్యలు తీసుకోవాలని స్థానిక రైతులు అధికారులను కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి- విజయపురం (నగరి) : పట్టణ పరిధి సెయింట్ మేరీ చర్చి సమీపం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన జయరాజ్ (75) అనే వృద్ధుడు బుధవారం మృతిచెందాడు. విజయపురం మండలం కేవీ శ్రీరామపురంకు చెందిన ఈయన చెన్నై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతిచెందినట్లు సీఐ విక్రమ్ తెలిపారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు

ప్రజాశక్తి- సోమల: పశువులు, దూడలు ముద్ద చర్మవ్యాధి బారిన పడకుండా పశువైద్య సిబ్బంది సూచనల మేరకు పశువుల యజమానులు వ్యాధి నిరోధక టీకాలను వేయించారని వైద్యాధికారిని చందన ప్రియా కోరారు. కందూరు పంచాయతీ బాలప్పగారిపల్లిలోని పశువులకు ముద్ద చర్మవ్యాధి నివారణ టీకాలను బుధవారం వేశారు. ఈనెల 12వ తేదీ నుంచి టీకాలు వేస్తున్నామని వర్షాభావం వలన కలిగే గాలులతో వైరస్ కారణంగా ఈ ముద్ద చర్మవ్యాధి పశువులకు విస్తృతంగా ప్రభలే అవకాశం ఉందని, ముఖ్యంగా చిన్నచిన్న దూడలలో ఈ వ్యాధి ఎక్కువగా సోకడం జరుగుతుందన్నారు. ఈ వ్యాధి సోకడం వలన చిన్న దూడలలో రోగనిరోధక శక్తి తక్కువగా ఉండి మరణాలు కూడా సంభవిస్తాయని, ఈ వ్యాధి నివారణ టీకాలు వేసుకోవడం వలన పాల దిగుబడి తగ్గుతుందన్న అపోహని వీడి పశుసంవర్ధక శాఖకు సహకరించి మండలంలోని రైతులు ముద్దచర్మ వ్యాధి టీకాలను తమ పశువులకు వేయించవలసిందిగా పశువైద్యాధికారి కోరారు. మండలంలోని 6500 పశువులకు ముద్ద చర్మ వ్యాధి టీకాలను వేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'యోగా'ంధ్ర... 'మద్యా'ంధ్ర..!

కుటుంబం, పిల్లలు ఏమీ పట్టదు.. బాధ్యతలు అసలు పట్టించుకోరు.. తప్పతాగి నడవలేక మందుబాబుల తిప్పలు ఇవి..

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ఓ పక్క రాష్ట్రాన్ని యోగాంధ్రను చేస్తామంటూనే..మరో పక్క మద్యాన్ని ఏరుల్లా పారిస్తోంది కూటమి సర్కార్. యోగా చేయండి.. ఆరోగ్యవంతులవ్వండి అంటూనే.. కోడి కూసిందగ్గర నుంచి నిద్ర పోయే వరకు ప్రజల చేత మద్యాన్ని తాగిస్తోంది. ఇందుకు నిదర్శనమే ఇక్కడ కనిపిస్తున్న ఫొటో. పట్టణంలోని పంచాయతీరాజ్ అతిథి గృహ ప్రహరీ గోడకు అధికారులు యోగాకు గుర్తుగా పెయింటింగ్ వేశారు. ఆ పెయింటింగ్ కింద ఓ మందు బాబు తాగి దొర్లుతుండడం 'ప్రజాశక్తి' కెమెరాకు చిక్కింది.

భక్తులకు మౌలిక సదుపాయాలు కల్పించండి : ఈవో

ప్రజాశక్తి - తిరుమల: తిరుమలలోని అన్నమయ్య భవన్‌కు సమీపంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న శ్రీవాణి టికెట్ల జారీ కేంద్రంలో భక్తుల కోసం మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉంచాలని టీటీడీ ఈవో జె.శ్యామలరావు అధికారులను ఆదేశించారు. తిరుమలలో జూలై 22వ తేదిన భక్తులకు అందుబాటులోకి రానున్న నూతన శ్రీవాణి కేంద్రాన్ని అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరితో కలిసి ఆయన బుధవారం ఉదయం పరిశీలించారు. కౌంటర్ వద్ద భక్తులు ఇబ్బంది పడకుండా టీ, కాఫీ, పాలు, తాగునీరు పంపిణీ చేయాలని ఆదేశించారు. భక్తులకు సౌకర్యవంతంగా ఉండేలా క్యూలైన్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. శ్రీవాణి టికెట్ల సమాచారాన్ని భక్తులందరికీ తెలిసేలా డిజిటల్ స్క్రీన్ల ద్వారా తెలియజేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం తిరుమలలో ఫుడ్ అండ్ వాటర్ ల్యాబ్‌ను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఈఈ సుబ్రమణ్యం, డిప్యూటీ ఈవోలు భాస్కర్, సోమన్నారాయణ, డీఈ చంద్రశేఖర్, హెల్త్ ఆఫీసర్ మధుసూదన్ పాల్గొన్నారు.

22న మామిడి రైతుల మహాజన సభ

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు

మామిడి రైతు మహాజన సభను విజయవంతం చేయాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా రైతు సంఘ రైతు సంక్షేమ సంఘం కన్వీనర్ ఆనంద నాయుడు కోరారు. బుధవారం ఈనెల 22వ తేదీ మంగళవారం మామిడి దినోత్సవ కరపత్రాలు పంపిణీ కార్యక్రమం జరిగింది. జడ్పీ సమావేశ మందిరంలో మామిడి రైతు సభ జరుగుతుందని ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, ఉద్యానశాఖ అధికారులు హాజరవుతున్నారని తెలిపారు. జిల్లాలోని గుజ్జు పరిశ్రమలు ప్రభుత్వం ప్రకటించినట్లు రూ.8లు చెల్లించాలని కానీ రూ.5,6లు మాత్రమే చెల్లిస్తున్నారని, ప్రభుత్వం ప్రకటించినట్లు రూ.8లు పరిశ్రమలు, రూ.4లు సబ్సిడీ ప్రభుత్వం అందించాలని డిమాండ్ చేశారు. సభకు రైతులు ఎక్కువ సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. కన్వీనర్లు హరిబాబు చౌదరి, గుణశేఖర్‌రెడ్డి, హరిబాబు నాయుడు, త్యాగరాజురెడ్డి పాల్గొన్నారు.

మండల టిడిపి అధ్యక్షుడి రేసులో ప్రసాద్

ప్రజాశక్తి- కార్వేటినగరం: మండల టిడిపి అధ్యక్షుడు రేసులో కొప్పేటి ప్రసాద్ విశ్రాంతి గ్రామ పరిపాలన అధికారిగా పనిచేశారు. బుధవారం ఆలత్తూరు పంచాయతీ , టిటి కండిగా గ్రామంలో ప్రభుత్వ ఎమ్మెల్యే డాక్టర్ వి.ఎం థామస్ ఆశీర్వాదం తీసుకున్నట్లు సమాచారం. 1983 నుంచి టిడిపి పార్టీకి వీరి కుటుంబంలో కీర్తిశేషులు కే పద్మనాభం నాయుడు 5 సార్లు మండల పార్టీ అధ్యక్షులుగా, ఒకసారి ఎంపీపీగా ఉన్న కుటుంబం వీళ్లది. శ్రీ వేణుగోపాలస్వామి, టిటిడి కళ్యాణమండపం, బాలికల ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల వీళ్ళు అధికారంలో ఉన్నప్పుడు తీసుకురావడం జరిగింది.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో సన్నిహిత సంబంధం ఉండేది, ఈ నేపథ్యంలో మండల టిడిపి పార్టీ అధ్యక్షులుగా కే.ప్రసాద్ ఎమ్మెల్యే డాక్టర్ థామస్ కలిసిన సందర్భంగా తెలపండి జరిగింది.

టీటీడీ బర్డ్ ట్రస్ట్‌కు రూ.10 లక్షల విరాళం

ప్రజాశక్తి - తిరుమల

టిటిడి బర్డ్ ట్రస్టుకు రూ.10,01,116ను దాతలు ముప్పరాజు జగదీష్, కదూరు విజయలక్ష్మిలు క్యాంపు కార్యాలయంలో ఛైర్మన్ బిఆర్ నాయుడును కలిసి విరాళం చెక్కును అందజేశారు. ఛైర్మన్‌తో పాటు బోర్డు సభ్యులు నన్నపనేని సదాశివరావు ఉన్నారు.

సర్పంచి శిరీష శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహిస్తూ...

అలిమేలు మంగాపురంలో 'డెంగీ'

నలుగురికి సోకినట్లు వైద్యపరీక్షల్లో నిర్ధారణ

ప్రజాశక్తి - సత్యవేడు

సత్యవేడు మండలం అలిమేలు మంగాపురం గ్రామంలో డెంగీ కలకలం రేగింది. పలువురికి డెంగీ లక్షణాలు బయటపడటంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. గ్రామంలో కొంతమంది డెంగ్యూ లక్షణాలు ఉన్నట్టు అనుమానంతో గ్రామ సర్పంచ్ శిరీష శ్రీనివాసులు రెడ్డి మంగళవారం సాయంత్రం దాసుకుప్పం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులకు సమాచారాన్ని ఇచ్చారు. ఈ నేపథ్యంలో బుధవారం ఏఎం పురం గ్రామంలో దాసుకుప్పం పీహెచ్సీ వైద్యాధికారి డాక్టర్ హర్షవర్ధన్, సర్పంచ్ శిరీష శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి డెంగ్యూ వ్యాధికి సంబంధించిన రాపిడ్ పరీక్షలు నిర్వహించారు. ఇందులో నలుగురికి డెంగీ లక్షణాలు ఉన్నట్టు బయటపడింది. గీత, గోవిందమ్మలకు డెంగ్యూ ఉన్నట్టు తేలింది. వెంకటరెడ్డి, అభిరామి లకు రాపిడ్ వైద్య పరీక్షల్లో లక్షణాలు కనిపించగా తుది పరీక్షల కోసం పెద్దాసుపత్రికి పంపించారు. డెంగీ నిర్ధారణ అయిన ఇద్దరినీ వైద్య చికిత్స అనంతరం పెద్దాసుపత్రికి రెఫర్ చేశారు. ఒక చిన్నారి పాపను సూళ్లూరుపేటలోని బాలిక శిశు సంరక్షణ కేంద్రానికి పంపించారు. గ్రామంలోని జ్వరపీడితులకు వైద్య చికిత్స అందించారు. తిరుపతి సబ్ యూనిట్ అధికారి మోహన్ పర్యవేక్షణలో మలాథిన్ మందును పిచికారీ చేశారు. నీటిని కాచి వడగొట్టి తాగాలని సూచించారు. ఇల్లిల్లు తిరిగి ప్రజలకు డెంగీ లక్షణాలను వివరిస్తూ, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు దామోదర్‌రెడ్డి, మునస్వామి యాదవ్, సాయికుమార్‌రెడ్డి, ఢిల్లీబాబుయాదవ్, దాసుకుప్పం పిహెచ్‌సి ఎంపిహెచ్ఇఒ సుబ్రమణ్యం, ఎంపిహెచ్ఎస్ మురళి పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRL., CIVIL JUDGE (JUNIOR DIVISION), CHITTOOR
O.S.NO. 520 OF 2024

Between:
A.Latha ....Plaintiff
And:
B.Kalavathi and others ... Defendants

NOTICE TO 3rd DEFENDANT

To
R3. B.Sathyendra,
S/o B.Jeevarathnam Naidu,
r/at Bandivallavooru Village,
Madhavaram Post,
Yadamari Mandal, Chittoor District.,

Sir, It is hereby brought to your notice that the above named Plaintiff filed above suit in **O.S.No.520 of 2024** against B.Kalavathi and others, in which you are named as 3rd defendant. The said suit posted for your appearance on **19-08-2025**, so that you are hereby ordered to appear before the Court on **19-08-2025 at about 10.30 A.M.** either in person or through pleader and answer the said suit, failing which the matter will be heard and determined in your absence.
(B.O.)

Sd/- **C.K.RAGHU**
Advocate for Petitioner

IN THE COURT OF THE PRL., CIVIL JUDGE (JUNIOR DIVISION), CHITTOOR
I.A.NO. 265 OF 2024
O.S.NO. 520 OF 2024

Between:
A.Latha ..Petitioner/ Plaintiff
And:
B.Kalavathi and others ...Respondents/ Defendants

NOTICE TO 3rd RESPONDENT

To
R3. B.Sathyendra,
S/o B.Jeevarathnam Naidu,
r/at Bandivallavooru Village,
Madhavaram Post,
Yadamari Mandal, Chittoor District.,
Sir,

It is hereby brought to your notice that the above named petitioner/plaintiff filed above petition. The petition is posted for your appearance of **19-08-2025**, so that you are hereby ordered to appear before the Court on **19-08-2025 at about 10.30 A.M.** either in person or through pleader and answer the said petition, failing which the matter will be heard and determined in your absence.
(B.O.)

Sd/- **C.K.RAGHU**
Advocate for Petitioner